క్లుప్తంగా

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



రైతులకు నవధాన్య కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ. భాస్కరరావు

బాడంగి: నవధాన్యాల సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని వైస్ ఎంపీపీ ఎస్. భాస్కరరావు అన్నారు. మండలంలోని పిన్నవలస ఆర్‌బీకే వద్ద ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నవధాన్యాల కిట్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శిరీష, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ వై.ఈశ్వరరావు, ఐసీఆర్‌పీ.రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: మూడేళ్లు నిండిన పిల్లలందరినీ వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూళ్లలో చేర్పించాలని తెర్లాం-5వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల ద్వారా అందించే సేవలను వివరించారు. అనంతరం పలువురు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి, హెల్పర్ లక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ

రేగిడి: మండలంలోని చాటాయివలస, లక్ష్మీపురం, రేగిడి, తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద రైతులకు పచ్చిరొట్ట ఎరువులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ జి. మురళీకృష్ణ మాట్లాడుతూ, రాయితీపై కట్టె జనుము, జీలుగ, పిల్లిపెసర , తదితర విత్తనాలను అందజేస్తున్నామని చెప్పారు. రైతులు వీటిని పొలాల్లో వేసి దుక్కులు చేపట్టాలని సూచించారు.

ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు విరాళం అందిస్తున్న గ్రామపెద్దలు

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామానికి చెందిన భార్యాభర్తలు బొద్దూరు శ్రీరాములు, బొద్దూరు చినతల్లి ఒకరివెంట మరొకరు వెంటవెంటనే మృతి చెందారు. వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు రూ. 25 వేలు సేకరించి వారి బంధువులకు బుధవారం అందజేశారు.

ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు

రేగిడి: ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్యామలాదేవి అన్నారు. మండలంలోని వన్నలిలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు ప్రారంభం కావడంతో మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

వంగర: మండల పరిధి ఇరువాడలో తాగునీటి బోర్లకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ పెద్దిరెడ్డి విజయ ఆధ్వర్యంలో సిబ్బంది తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకువచ్చారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ తట్టికోట కన్నబాబు

వంగర: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. బుధవారం స్థానిక గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే రికార్డులు పరిశీలించారు. అధిక ధరలకు విక్రయించొద్దని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ, గుర్తింపు ఉన్న ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు రశీదులను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘నేను బడికిపోతా’



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ



రేగిడి : భవిత కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు



తెర్లాం: వెలగవలసలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తెర్లాం: మండలంలోని వెలగవలసలో ‘నేను బడికి పోతా’ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వీవీ ధనుంజయరాజు మాట్లాడుతూ, బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు, వీఆర్‌ఓ రాము, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి: బడిఈడు వయసున్న చిన్నారులందరూ పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల అధికారులు రాజారావు, ఆంజనేయులు, రాజేశ్వరి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు నుంచి ఆరేళ్లలోపున్న వారిని అంగన్‌వాడీ కేంద్రాలకు.. ఆపై వయసున్న చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, సచివాలయ వెల్ఫేర్ సహాయకులు, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి

- ఎంపీడీఓ ఈశ్వరమ్మ

రామభద్రపురం: బడిఈడు పిల్లంతా బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్యలతో కలిసి సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు బడికి దూరం కాకూడదనే లక్ష్యంతో చేపడుతున్న నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి..

రేగిడి : బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండేటట్లు తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు కోరారు. భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో గుర్తించిన దివ్యాంగ చిన్నారుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పిల్లలను ఇంటి వద్ద ఉంచవద్దని, భవితా కేంద్రాల్లో గాని, ప్రభుత్వ పాఠశాలల్లో గాని చేర్పించాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి డ్రాపౌట్స్‌పై ఆరాతీశారు. పాఠశాలల ఉపాధ్యాయులతో కలసి ఆయా గ్రామాల్లో బడికిపోదాం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎరకయ్య, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

- ఏఓ శిరీష



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శిరీష

బాడంగి : విత్తనశుద్ధి చేపట్టడం వల్ల తెగుళ్ల బెడద ఉండదని మండల వ్యవసాయాధికారి కె. శిరీష అన్నారు. మండలంలోని ముగడ ఆర్‌బీకే వద్ద వరి విత్తనశుద్ధిపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖరీఫ్ వరి సాగులో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నాట్లు వేసే ముందు పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆమెతో పాటు ఐసీఆర్‌పీలు కుమారి, రామలక్ష్మి, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా ప్రాణాంతకం



రేగిడిలో సికెన్‌సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

రేగిడి : సికిల్‌సెల్ ఎనీమియా ప్రాణాంతకమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.అసిరినాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తకణాలు తగ్గడం, కళ్లు పసుపురంగులోకి మారడం, ఒంటినొప్పులతో పాటు కీళ్లనొప్పులు రావడం ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సోహిణీరాఘవ్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ సుందరేశ్వరరావు, హెచ్‌వీలు పుష్ప, జ్యోతి, సూపర్‌వైజర్ కేవీ అప్పారావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టైమ్‌టేబుల్ తప్పనిసరి



విద్యార్థినుల హాజరుశాతం పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం : బోధనలో టైమ్‌టేబుల్ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. గురవాం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త పుస్తకాలు వచ్చేలోగా పాత పుస్తకాలను విద్యార్థులకు అందజేసి బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సావిత్రి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు



వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథరావు

సంతకవిటి: కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటవుతుందని ఉపాధి ఏపీఓ ఆర్. హరనాథరావు అన్నారు. మండలంలోని ఎస్.రంగారాయపురం రేణుకర్ర చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా ఉదయం 6 గంటల నుంచి 11 వరకు పనులు చేయాలని సూచించారు. సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు 300 రూపాయల వేతనం వస్తుందని చెప్పారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అయోడిన్, కాటన్, తదితర ఫస్ట్ ఎయిడ్ సామగ్రి పని ప్రదేశంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని క్షేత్ర సహాయకులకు సూచించారు.

అంచనాలు తయారు చేయండి..



ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమైన అధికారులు

రాజాం సిటీ: ప్రతి గ్రామంలో హార్టికల్చర్ పెంపే లక్ష్యంగా అంచనాలు తయారుచేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఏపీడీ ఎం.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరమైన రైతులు ఫారంపాండ్స్ గుర్తించి అంచనాలు తయారు చేయాలని సూచించారు. అలాగే ఫిష్ పాండ్స్‌కు అంచనాలు రూపొందించి వేతనదారులచే పనులు చేయించాలన్నారు. సగటు వేతనం రూ. 300 వచ్చే విధంగా వేతనదారులకు రెండు పూటలా పనులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం, ఈసీ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

- సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



వివిధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక కోర్టులో పోలీసు, రెవెన్యూ, బ్యాంక్ అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదాలత్ తీర్పే అంతిమమని, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, సంతకవిటి డీటీ ఆర్.రంజిత్, ఎక్సైజ్ ఎస్సై ఎస్.చంద్రశేఖర్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

వంటలు రుచిగా ఉండాలి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, తదితరులు

రేగిడి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటలు రుచిగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని పనసలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులను చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సునీత, ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

పరిశీలన



కమిషనర్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే రంగారావు

బొబ్బిలి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటిన్ భవనాన్ని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు బుధవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మితో పాటు క్యాంటిన్‌లోని సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. త్వరలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణంతో పాటు రామభద్రపురంలోని రైతు క్యాంటీన్‌లను ప్రారంభిస్తామన్నారు. దీనికి సంబంధించిన తాగునీరు, పారిశుధ్య, తదితర అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ప్రతి మండల కేంద్రంలోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. ఆయనతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, తదితరులున్నారు.

జీవామృతంతో అధిక దిగుబడులు

బొబ్బిలి రూరల్: రైతులు తమ పంటపొలాల్లో నాణ్యమైన ఘన జీవామృతం వినియోగించడం వల్ల అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు తెలిపారు. మండంలోని జగన్నాథపురంలో నాణ్యమైన ఘన జీవామృతం తయారీ విధానంపై మహిళా రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఐదులీటర్ల ఆవు మూత్రంలో 4 కిలోల బెల్లం, 200 కిలోల ఆవు పేడ, 4 కిలోల శనగపిండిలను కలపి ఉండలుగా చేసుకోవాలని సూచించారు. ఆవుమూత్రంలో బెల్లం , పుట్టమన్నును కరిగించి ఈ మూడు మిశ్రమాలను కలిపి నీడలో ఆరబెట్టాలని అన్నారు. ఇలా ఆరబెట్టిన మిశ్రపు ఉండలను గోనెసంచులలో నిల్వ ఉంచి ఆరు నెలల వరకు వినియోగించుకోవచ్చని సూచించారు. ఆఖరిదమ్ములో ఎండిన జీవామృతం 400 కిలోలు చల్లాలని, ఇది డీఏపీలా పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు శంకరరావు, ఐసీఆర్‌పీలు, మహిళారైతులు పాల్గొన్నారు.

నేడు పాల్తేరులో యోగా దినోత్సవం

బాడంగి: మండలంలోని పాల్తేరు హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు పార్వతీమల్లికార్జునస్వామి కమిటీ ఆర్గనైజర్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం అయినప్పటికీ కోయంబత్తూరుకు చెందిన ఈశా ఫౌండేషన్ వారు ఒకరోజు ముందుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన



టిడ్కో గృహాలపై సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం సమీపంలోని టిడ్కో గృహాలను కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్మాణాలకు ఎంత మొత్తంలో నిధులు అవసరమో గుర్తించాలన్నారు. అలాగే ఇతర సౌకర్యాలపై ఆరా తీయడంతో పాటు అవసరాలను గుర్తించి నివేదిక అందించాలని సూచించారు. ఈయనతో పాటు ఏఈలు వెంకట్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

బొబ్బిలిరూరల్: విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందజేసిన స్టూడెంట్ కిట్లను శతశాతం పంపిణీచే శామని మండల విద్యాశాఖాధికారి చల్లా లక్ష్మణరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో 91 పాఠశాలలకు సంబంధించి విద్యార్థులకు 6,851 జతల కిట్లను అందజేశామన్నారు. వీటిలో బెల్టులు, బూట్లు, బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, యూనిఫారం ఉన్నాయన్నారు. కొత్తగా చేరే విద్యార్థులకు కిట్లు ఇంకా రావాల్సి ఉందని తెలిపారు.

మోసగాళ్లపై కేసులు నమోదు చేయాలి..

బొబ్బిలి: అమాయక గ్రామీణప్రాంత వాసులకు నకిలీ బంగారాన్ని విక్రయిస్తున్న జ్యుయలరీ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలోని పలు దుకాణాల యజమానులు ప్రజలను మోసగిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి. శంకరరావు, ఒమ్మి రమణ, కోట అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో ప్రగతి చూపాలి

- ఎంపీడీఓ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో చేపడుతున్న జాతీయ ఉపాధిహామీ పనుల్లో ప్రగతి చూపాలని ఎంపీడీఓ రవికుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు అవసరమైన వాణిజ్య పంటల మొక్కల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. వాణిజ్యపంటల సాగుపై అవగాహన కల్పించి, రైతులు సాగుకు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఉపాధి జేఈ కళ్యాణచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

తోటల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

రేగిడి : రైతులు తమ పంటపొలాల్లో తోటలు వేసుకునేందుకు తగిన ప్రోత్సాహం అందించాలని ఉపాధి ఏపీడీ మీసాల శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉద్యానవన పంటల సాగుకు రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకు నిధులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఏపీఓ హరనాథరావు, ఈసీ రామినాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, తదితరులు

రాజాం సిటీ: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై పాఠశాల స్థాయిలో అవగాహనా అంశాల్లో భాగంగా బుధవారం పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పరిసరాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు



బకాయిపడిన షాపులకు తాళాలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాలిటీకి సంబంధించిన షాపుల బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని మున్సిపాల్టీకి చెందిన షాపులను బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పలు మార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ సంబంధిత యజమానులు పట్టించుకోకపోవడంతో అటువంటి షాపులకు తాళాలు వేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. బకాయిదారులు త్వరితగతిన పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సమయపాలన పాటించాలి

తెర్లాం: ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని కూనాయవలస ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరుపట్టిక, వివిధ రికార్డులు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు, తదితర అంశాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

దాడులపై కేసుల నమోదు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన దాడులపై బుధవారం కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎస్. భాస్కరరావు తెలిపారు. పోలీసులు తెలియజేసిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 18న అసిరితల్లి వారాల సందర్భంగా సచివాలయం దగ్గరలో ఎస్టీ వీధికి చెందిన కొంతమంది వైఎస్సార్‌సీపీ మహిళల పట్ల టీడీపీకి చెందిన వారు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఇది మంచిపద్ధతి కాదని మహిళలు నచ్చజెప్పడంతో టీడీపీకి చెందిన అల్లు రమణతో పాటు మరికొంతమంది కులం పేరుతో ధూషించి చేతులతో కొట్టారని బాధితులు ఫిర్యాదు చేశారు. అలాగే తల్లితో పాటు తన ఇంటి వద్ద కూర్చుని ఉన్న అలజంగి లక్ష్మణను టీడీపీకి చెందిన మూకళ్ల రాము, మరొకరు కొట్టారని.. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అగిరెడు వీరాస్వామి ఇంటికి వెళుతుండగా గుండ పెంటన్నాయుడు, మరికొంతమంది చేతులు, కర్రలతో కొట్టారని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ దాడిలో గాయపడిన లక్ష్మణరావు, వీరాస్వామి, దేవి, ప్రసాద్‌లను ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా ఇంటి వద్ద కూర్చుని ఉన్న తనపై వైఎస్సార్‌సీపీకి చెందిన ఎ.లక్ష్మణతో పాటు మరికొంతమంది వచ్చి కులంపేరుతో ధూషించారని... అలాగే ఇంటికి వెళ్లిపోతున్న అసిరినాయుడు, జనార్దన్‌లపై లక్ష్మణ, వీరాస్వామి దాడి జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దాడులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.